# పెళ్ళినాడిచ్చిన కట్నం

**నే**ను మొదటినుంచీ ఇలా లేను. మొన్న 1925లో గాంధీ మహాత్ముడు అసహాయోద్యమం మొదలుపెట్టాడు చూడండి? అప్పుడు నాకొక విధమైన ఆవేశం బయల్దేరింది. ఎవరికి బయల్దేరదు కనక. ఈ రాజ్యతంత్రమేమిటి? ఈ లోకం ఏమిటి? ఈ జీవిత మేమిటికదా అని ఆలోచించటం మొదలుపెట్టాను. చూశారో లేదో? ఈ సమాసాలు చాలా ఘట్టివి. వీటిని గురించి తవ్వినకొద్దీ వుంది. మనం జీవితంలో ఎంత అన్యాయం చేస్తున్నామో ఆలోచించండి. మనకింత ఉపకారం చేస్తున్న బ్రిటీషు గవర్నమెంటు మీదనే గాంధీ మహాత్ములు సహాయ నిరాకరణం ప్రయోగిస్తున్నప్పుడు - అంటే చూశారో లేదో! గాంధీగారి కెదురు చెప్పటానికి నే నేపాటివాణ్ణి కాని, బ్రిటీషువారు మనకు చేసిన లాభాలు ఒకటి రెండు కావు. పోస్టాఫీసులు పెట్టారా! ఉద్యోగాలిస్తున్నారా! కాలవలు తవ్వారా? అన్నిటికన్నా ముఖ్యం, రైళ్ళు వేశారా? రైళ్ళంటే చెబుతా! నా పెళ్ళయిన కొత్తలో మా మామగారూరు పోవాలంటే అయిదు కోసులు రొండెడ్లబళ్ళు కట్టించుకొని తెల్లవారటానికింకా పది ఘడియలు పొద్దుండగా బయలుదేరితే కాని తెల్లవారి చేరేవాళ్ళం కాదు. ఇప్పుడో గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని బయల్దేరితే స్టేషను ఒక మైలు. ఆ స్టేషనులోనే ఒక గంట నడుం వాలిస్తే చేరుతాం. అవతల మామగారి ఊరు కాలవకట్టనే పోతే రొండు కోసులు. ఆడుతూ పాడుతూ పోవచ్చు. ఎంత ఉసులో చూడండి. ఈ రైలు వేసేటప్పుడింకో చిత్రం జరిగింది. మా మామగారి భూమిలో అయిదెకరాలు మాన్యం రైలుకింద పడ్డది. దాని కోసరం అర్జీలు పెట్టుకుంటే గవర్నమెంటువారు అయిదువందల రూపాయలు అక్షరాలా ఇప్పించారు. "మీకోసం వేసిన రైలేకదా, ఏదో పొలం దానికింద పడదా? మేమేమీ ఇయ్యం" అంటే మా మామగారేం చెయ్యగలడు, చెప్పండి! ఇన్ని చేసిన బ్రిటీషు గవర్నమెంటుకే గాంధీ మహాత్ముడు అసహాయోద్యమం చేస్తుంటే మా మామగారి దగ్గిరినించి నేను పెళ్ళినాడు అయిదువందలు కట్నరూపేణా తీసుకోటం ఎంత అన్యాయం! అందులో ఆయన తాలూకు అయిదెకరాలు రైలుకిందపడి కూడా పోయినప్పుడు. నావి అయిదెకరాలేమైనా ఆయన రైలుకింద పడ్డయి కనకనా!

ఆయనా ఎక్కువ స్థితిలో ఉన్నవాడేం కాదు. రైలుకింద పడ్డ అయిదెకరాలూ కూతురి

పెళ్ళికి అమ్మిన రొండెకరాలూ పోగా మిగిలిన నాలుగెకరాలు చిల్లరా మా మామగారు కోర్ట్లవెంట తిరిగి ఖర్చు చేసేశాడు. అయితే ఏం? ఆయనకు వ్రతం చెడ్డా ఫలం దక్కింది. వాళ్ళ వూళ్ళో ఆయనంత ప్రయివేటు లేవన్నారా లేదా? మా బావమరిదేమో చదువుకింద డబ్బు తగలేసి తగలేసి చివరకు ఉద్యోగమైనా చెయ్యక జేబులో ఉత్తమనీ పర్సు వేసుకుని కాఫీ హోటళ్ళచుట్టూ తిరుగుతున్నాడు. ఇటువంటి స్థితుల్లో నేను కట్నం బాపతు డబ్బు మామగారికి తిరిగి ఇవ్వటం న్యాయమేకాక ధర్మంగా కూడా కనపడ్డది.

ఇప్పుడింకొక చిక్కువచ్చి పడ్డది. ఆన 1917 ది 7 జనవరి తారీఖున నా పెళ్ళయిందనుకోండి. ఆనాడు నాకు వెండి చెంబులూ, పట్టుతాపితాలూ వగయిరాలకిందా మిగిలినది రొక్కంగాను యిచ్చిన మొత్తం వెరసి అక్షరాలా ఐదువందలనుకోండి. యిందుక్కు వడ్డీ నెల ఒకటికి వడ్డీ కట్టవద్దా! పదహారు సంవత్సరాల కింద తీసుకున్న అయిదువందలు ఇప్పుడింకా అయిదువందలుగానే వుండవుగా! మనుష్యులూ, పశుపక్ష్యాదులూ చివరకూ గోళ్ళూ, జుట్టూ కూడా పెరుగుతున్నప్పుడు – వెధవది గడ్డం వంటిది పెరుగుతున్నప్పుడు – డబ్బు పెరగదంటే ఎవడు నమ్ముతాడు? అయితే ఏ రేటున వడ్డీ కట్టాలి. మూడురుపాయల బేడా మార్వాడీ వడ్డీ దగ్గిరనించి పావలా బ్యాంకు వడ్డీ వరకూ వుంటున్నది వడ్డీరేటు. నేనందులో ఏరేటు తీసుకోవాలి? మా మామగారు యీ డబ్బు ఏ విధంగా ఉపయోగించి వుండేవాడు? వడ్డీకిచ్చాడనుకుందాం. ఈయన దగ్గిర మూడు రూపాయల బేడాకు ఎవడప్పు తీసుకుంటారు కాని? ఆ డబ్బాయిన బ్యాంకిలోవేసి వుండేవాడనుకుని తక్కువ వడ్డీ ఇవ్వటం కూడా న్యాయం కాదు. పైగా అంతవరకూ ఊహించుకున్న తరవాత ఆ బ్యాంకి దివాలా ఎత్తిందనుకోటం కూడా చాలా తేలికవుతుంది. చష్ ఇది బాగాలేదు. అదీకాక ఈ డబ్బు మా మామగారికిస్తే శతవిధాలా జరిగేదేమిటంటే ఆ కాస్తా మా బావమరిది తన ఖాళీమనీ పర్సులో వేసుకుని కాఫీ హోటళ్ళచుట్టూ తిరగటానికి బదులు కాఫీ హోటళ్ళనే ఇంటికి పిలిపిస్తాడు. యిదంతా యెందుకు? మనకు కంపెనీ రేటు వుండనే వుంది. నెల ఒకటికి నూటికి ఒక రూపాయి. మనకు చాలా తేలికగా వుంటుంది అనుకున్నాను.

కాని లెక్కవేసి చూసిన మీదట మనకు తేలికగా వుంటుందన్న భ్రమ వదిలింది. నేను నా ఏకాంతాన లెక్క చూసుకోగా నేను మా మామగార్కి ఇవ్వతేల్ని బాకి ఒక్క దమ్మిడి తక్కువ లేకుండా రెండు సంచులు! నా గుండె బద్దలయింది. ఇదెలాగురా భగవంతుడా. నేను మా మామగారి రుణాన పోవలసిందేనా అనుకుంటుండగా యింకో విషయం కూడా జ్ఞాపకం వచ్చింది. నేను కట్టింది బారువడ్డీ మూడు సంవత్సరాల కొకసారి తిరగరాస్తే కాని చెల్లి చావదాయె? దేవుడా అంటూ మూడేళ్ళకోసారి తిరగరాతలతో లెక్క చూశాను. అసలు నోటేదంటారేమో? న్యాయానికి బద్ధ కంకణం కట్టుకున్న వాడికి నోటుతో ఏం పని? ఈసారి నేనివ్వతేలిన మొత్తం వందో రొండొందలో తక్కువగా నాలుగువేలయింది.

ఇంకొక్కడైతే ఇక్కడ వెనక్కు తిరిగి పోవలసిందే! నే నలా చెయ్యలేదు. సావిత్రి యముడివెంట పోతూ ముళ్ళకు భయపడ్డదా? నా తెలివితేటలన్నీ ఉపయోగించి న్యాయానికి భంగం లేకుండా ఈ మొత్తాన్ని తగ్గించే ఉపాయం ఏదా అని ఆలోచించాను.

నా మనసులో వడ్డీ న్యాయశాస్త్రంలో చెప్పబడలేదేమో అని ఒక ఆశ ఉంటూ వచ్చింది. అందువల్ల అది కాస్తా తేల్చుకుందామని ఒక ప్లీడరుగారిని వెళ్ళి అడిగాను. ఆయన నావంక చిత్రంగా చూసి "వడ్డీ ఇవ్వటం న్యాయమా అని అడుగుతున్నారూ? న్యాయశాస్త్రంలో అత్రిమహాముని చెప్పిన ప్రకారం వడ్డీ యిస్తే ఒక్క క్షణంలో మనం దివాలా ఎత్తిపోమంటండీ?" అన్నాడు. అసలందాకా ఎందుకు? వడ్డీ యివ్వటం తీసుకోటం అన్యాయమే అయితే యింతమంది ప్రతి రోజూ నోట్లు రాసి చివరకు "యిది సమ్మతిన్ని వ్రాసి యిచ్చిన ప్రాంశరీ నోటు" అని ఎందుకంటున్నారు?

ఇప్పుడేం చెయ్యాలి? ఇంతలో ఒక భేషయిన ఆలోచన తట్టింది. మేధావి కేదీ అసంభవం కాదనుకోండి! పెళ్ళి కిచ్చిన మొత్తంలో లాంఛనాలకింద రెండు వందల యాభైదాకా పోయినా రొక్కం రెండొందల యాభై మాత్రమే. లాంఛనాలు బాకీ ఎలా అవుతై? అల్లుడుగదా అని ఇచ్చిన వస్తువులు బాకీకింద రావని రూఢి చేసుకున్నాను. ఎటుపోయి ఎటు వచ్చినా అడిగి కనుక్కుందామనీ నా భార్యను కదిలించాను.

"మీరు గొంతుమీద కూర్చుంటే యిచ్చాడు కాని ఆయన కొక్క కానీ ఇవ్వటం ఇష్టం లేదు. మా నాన్న పట్టుబట్టల దగ్గిర్నించీ మీ బలవంతం మీదే యిచ్చాడు" అన్నది నా భార్య.

దాని మాటలకేం కాని లాంఛనాలు బాకీ కింద రావు. పోగా నేనివ్వతేలిన అసలు రెండువందల యాభై, అందుకు వడ్డీ. బారువడ్డీ అయితే కొంత తేలికగా పోను. ఎంతో ఆలోచించిన మీదట ఒక వుపాయం తోచింది. మూడేళ్ళూ గడువు దాటుతున్నదనంగా నోటుమీద ఓ అయిదు రూపాయలు చెల్లువేస్తే నోటు ప్రాణం నిలుస్తుంది. నేనుకూడా అయిదయిదులు చెల్లువేస్తే బారువడ్డీతో సరిపోతుంది. ఈ వుపాయం చాలా బాగుంది. ఈ ప్రకారం లెక్కవేసి బాకి పాతిక తక్కువ వెయ్యి రూపాయలకు దించాను. ఇంతవరకు నా న్యాయదీక్షకు భంగం లేదు. కాని ఈ కరువు కాలం వెయ్యి రూపాయలెక్కడ దొరుకుతై? దీనిక్కూడా ఒక్కటే వుపాయం వుంది. ఈ మొత్తం అయిదారు కిస్తీలుగా కడితే సరి.

అయితే యిప్పుడు రెండువందల రూపాయలు కావాలి. అంత మొత్తం ఎలా పుట్టిద్దామా అని ఆలోచన చేశాను. వచ్చే సంవత్సరంనించి పంటలోనించి ఇవ్వవచ్చును. ప్రస్తుతం ఇల్లాలి మెళ్ళో నగ ఏదైనా అమ్మి యిప్పటికి సరిపెడదామనుకున్నాను. అందుకని నా భార్యను మెళ్ళోకంటె యివ్వమన్నాను. వాళ్ళ నాన్న బాకీ తీర్చటానికే గనక తప్పకుండా

యిస్తుందనుకున్నాను. కాని యివ్వనంది. ఎలాగన్నాను. సోదడగమంది. నాకు మండి - మర్నాడు నగలు తీసి పెట్టెలో పెట్టి ఆవిడ దొడ్లో తలంటి పోసుకుంటున్న సమయంలో కంటె కాస్తా తీసి ఒక కంసాలి దగ్గిరికి తీసికెళ్ళి అమ్మజూపాను. వాడు దాన్ని అన్ని పరీక్షలూ చేసి నూటయాభై యిస్తానన్నాడు. మూడొందలు పెట్టి చేయించిన గట్టి కంటెను నూటయాభై ఏమిటి? నేనమ్మనన్నాను. పోలీసులను పిలవనా అన్నాడు. ఇప్పుడు పోలీసును పిలిస్తే ఈ సంగతి కాస్తా వాడు నా భార్యకు తెలియజేస్తాడేమో. అమ్మిన తరవాత ఎవరేం చేసేది లేదులే అని నూటయాభై తీసుకుని ఈసారి కింతే మనియార్డరు చేద్దామని ఆ డబ్బు పట్టుకుని పోస్టాఫీసుకు వెళ్ళి చాతయిన వాళ్ళచేత అది మామగారికి టపా చేయించి ఆ రోజునే ఈ విధంగా ఉత్తరం రాశాను. ఆయన పెద్ద ప్రైవేటు కనక సంతోషిస్తాడని నాలుగు వ్యవహారం ముక్కలు కూడా విసిరాను.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన శంకరయ్య మామగారి దివ్య సముఖమునకు మీ అల్లుడు పదివేల నమస్కారములు చేసి వ్రాసుకున్న ఉత్తరం. లోగడ నేను మీ వద్ద అనగా 1917 ది 7 జనవరి తారీఖ్న మూజువాణీగా అప్పు పుచ్చుకున్న రొక్కం రు. 250లు అక్షరాల రెండువందల యాభై రూపాయలు, యిందుకు వడ్డీ నెల ఒకటికి నూటికి ఒక రూపాయి చొప్పున చెల్లులు పాతిక రూపాయలు పోను ఈనాటికి నేను మీకు ఇవ్వతేలిన బాకీ యావత్తూ కలిసి వెరశి మొత్తం రు. 975లు. అక్షరాల తొమ్మిది వందల డెభ్భై ఐదు రూపాయలు. అయిదు సంవత్సరాలమీద దఫాలుగా ఇవ్వడానికి ఒప్పుకున్నాను. గనక యీ దఫాకు దామాషాగా రు. 150లు మింజుములె ఈ రోజున నేను మీ పేర మనియార్డరు చేయించినాను గనక అది అందిన సంగతి వెంటనే తెలియచేయవలెనని ప్రార్థించుచున్నాను. ఇంతే సంగతులు. ఇక్కడ అంతా క్షేమం. మీ క్షేమం తరుచు వ్రాయించగలందులకు ప్రార్థించుచూ యున్నాను. మీ అమ్మాయి క్షేమముగానే యున్నది. అత్తగారిని అడిగానని చెప్పవలెను. ఇట్లు విధేయుడు..."

మూడో రోజున మా మామగారి దగ్గిరనించి ఉత్తరం వచ్చింది. దాన్లో డబ్బందినట్టు రాయలేదు కాని తనకు నేను బాకి వున్న మొత్తం రు. 1500 లు అన్నట్టు జ్ఞాపకం అని మాత్రం రాశాడు. మరి ఆయన ఏ లెక్క ప్రకారం వేశాడో!

ఈ లోపల – ఈ లోపలేమిటి? ఆరోజునే – నా భార్య నగ సంగతి కనుక్కున్నది. వాళ్ళ నాన్నకు ఉత్తరం రాశింది కాబోలు. నాలుగో రోజున ఆయన మళ్ళీ యింకో ఉత్తరం రాశాడు. ఈసారి మాటలు చాలా ఘాటుగా దొర్లినాయి. "ఇదేమిటయ్యా! నీ దుంపతెగ, మా పిల్ల కంటె కాస్తా అమ్మేశావుట. ఆ కంటె వెంటనే కక్కుతావా? నీ మీద దావా వెయ్యమన్నావా?"

నాకు దావాలంటే భయమేకదా? ఏం చెయ్యను. ఒక వడ్డీ వ్యాపారంచేసే ఆయన దగ్గిరికి పోయి నూటయాభై రూపాయలప్పియ్యమన్నాను. ఇందుకు వడ్డీ నెల ఒకటికి అనేచోట రూపాయి తొమ్మిదణాలు వెయ్యమన్నాడు. ఆశ్చర్యపడి యెందుకన్నాను. నెలకు రూపాయికికానీ అన్నాడు. సరేకదా అని ఆ ప్రకారమే రాసి రూపాయలు తీసుకుని కంసాలి దగ్గిరికి వెళ్ళాను. వాడు కంటె అప్పుడే పోయిందన్నాడు. నాకు కళ్ళనీళ్ళ పర్యంతమైంది. వాడు జాలిపడి రొండొందలిస్తే యిస్తానన్నాడు. లేకపోతే పోలీసుకు చెబుతాడని నేనే గ్రహించుకుని మళ్ళీ అప్పిచ్చినాయన దగ్గిరికి పరిగెత్తాను. ఇంకో యాభై రూపాయలిమ్మన్నాను. నోటు రాయమన్నాడు. వడ్డి ఈసారి రూపాయి పద్నాలుగణాలన్నాడు. ఏ లెక్క ప్రకారం అన్నాను. ఆయన నవ్వి, రోజుకు నూటికి అణా అన్నాడు. సరే తెమ్మన్నాను. ఆ డబ్బు కూడా తీసుకుని కంసాలి దగ్గిరికి పోయినాను. వాడా డబ్బు జాగ్రత్తగా లెక్కపెట్టి దాచి నా చేతికి కంటె యిచ్చాడు. ఆ నగ చూడగానే నా దుఃఖం ఆగలేదు. బంగారమంటి కంటె పది ముక్కలయి వుంది!

*మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, నవంబర్ 1933*